నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM www.suryaa.com

ఆదివారం 28-09-2025 పేజీలు: 02


## రేపే ది రాజా సాబ్ ట్రైలర్ రిలీజ్




హారర్ కామెడీ మిశ్రమంగా తెరకెక్కుతున్న రిబెల్ స్టార్ ప్రభాస్ సినిమా 'ది రాజా సాబ్' ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పుతోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం లో వింటేజ్ ప్రభాస్ కామెడీ టైమింగ్, డార్లింగ్ ప్రభాస్ స్టైల్ ప్రేక్షకులకి పిచ్చెక్కి స్తుందని దర్శకుడు ఇప్పటికే హింట్ ఇచ్చారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్‌లతో మంచి బజ్ క్రియేట్ అయిన ఈ సినిమాకు ట్రైలర్ విడుదలకు రంగం సిద్ధమైంది. తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించిన సమాచారం ప్రకారం, 'ది రాజా సాబ్' ట్రైలర్‌ను సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నారు.

# నా హృదయం ముక్కలైంది.. భరించలేని బాధ ఉంది

తమిళనాడులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ నిర్వహించిన ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటన శనివారం సాయంత్రం కరూర్ పట్టణంలో జరిగింది. టీవీకే పార్టీ తరఫున విజయ్ రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా కరూర్ లో ఏర్పాటు చేసిన సభకు అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. విజయ్ వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంగణంలోని ఇరుకైన ప్రాంతంలో ఒక్కసారిగా జనం ముందుకు తోసుకురావడంతో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో జనం ఒకరిపై ఒకరు పడిపోవడంతో ఊపిరాడక, కిందపడి నలిగిపోయి 36 మంది అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను హుటాహుటిన సమీప ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ముగ్గురు చిన్నారులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై నటుడు విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. నా గుండె పగిలిపోయింది. మాటలకు అందని, వర్ణించలేని బాధతో కుమిలిపోతున్నాను. కరూర్ లో ప్రాణాలు కోల్పోయిన నా సోదర సోదరీమణుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ. 10 లక్షలు, గాయపడిన వారికి రూ. లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలను తెలుసుకోవడానికి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిఫార్సులు చేయడానికి న్యాయ విచారణకు ఆదేశించారు. ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు జాతీయ నాయకులు ఈ విషాదం పట్ల సంతాపం ప్రకటించారు.



కరూర్ మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన విజయ్ తమిళనాడులోని కరూర్ కన్నీరుపెడుతోంది. రాజకీయ నాయకుడిగా మారిన అభిమాన హీరోను చూడటానికి కరూర్ ప్రజలు పోటెత్తారు. అయితే, కార్నర్ మీటింగ్ కాస్తా, మృత్యుక్షేత్రంగా మారింది. 39 కుటుంబాల్లో తీరని వేదన మిగిలింది. తమిళనాడులోనే కాదు, యావత్ దేశంలోనూ విషాదం నింపింది. తమిళనాడులోని కరూర్‌లో టీవీకే అధినేత విజయ్ ర్యాలీలో శనివారం రాత్రి తొక్కిసలాట జరిగింది.. ఈ ఘటనలో ఇప్పటివరకు 39 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర విషాదంలో 10 మంది చిన్నారులు, 18 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారు.. ఇంకా కరూర్‌లోని వివిధ ఆస్పత్రుల్లో 95 మందికి చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. కరూర్ తొక్కిసలాట ఘటనపై స్పందించిన తన హృదయం ముక్కలైందంటూ పేర్కొన్నారు. దుఃఖం, బాధలో మునిగిపోయానని.. ఈ బాధ భరించలేనిది.. వర్ణించలేనిది అంటూ ట్వీట్ చేశారు.. ఈ క్రమంలోనే.. ఆదివారం కరూర్ బాధితులకు TVK విజయ్ పరిహారం ప్రకటించారు. చనిపోయినవారి కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షల పరిహారం అందించనునట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు పూడ్చలేని నష్టమిదని.. ఈ బాధను చెప్పడానికి నాకు మాటలు రావడం లేదంటూ.. విజయ్ పేర్కొన్నారు. ''మీ ముఖాలన్నీ నా మదిలో మెదులుతున్నాయి.. నాపై అభిమానం చూపిన వారి గురించి ఆలోచించినప్పుడల్లా.. నా గుండె మరింతగా బరువెక్కుతోంది.. మీ కుటుంబసభ్యుడిగా మీకు పరిహారం అందిస్తున్నా.. ఈ నష్టం ముందు ఈ డబ్బు పెద్ద విషయం కాదు.. కానీ భారమైన హృదయంతో మిమ్మల్ని ఆదుకోవడానికి.. మీలో ఒక్కడిగా సహాయం చేయడం నా బాధ్యత''.. అంటూ విజయ్ తెలిపారు.

### టివికె అధినేత విజయ్ కు భారీ భద్రత

కరూర్ ఘటన నేపథ్యంలో తమిళనాడు రాజకీయ వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలోని నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఇంటి చుట్టూ నాలుగు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి, ఆ మార్గంలో సాధారణ ప్రజలను కూడా అనుమతించడం లేదు. ఈ చర్యలతో ఆ ప్రాంతం మొత్తం భద్రతా వలయంలోకి చేరినట్లయింది. కరూర్ ఘటన అనంతరం డీఎంకే కార్యకర్తలు విజయ్ ఇంటిని చుట్టుముట్టి నిరసన తెలపాలని ప్రయత్నించగా, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని వారిని అడ్డుకున్నారు. మరోవైపు విజయ్‌కు మద్దతుగా టీవీకే కార్యకర్తలు కూడా ఆయన ఇంటి వద్దకు చేరుకోవడానికి ప్రయత్నించారు. కానీ అక్కడ కూడా పోలీసులు గట్టి నిఘా పెట్టి వారిని వెనక్కి పంపించారు. దీనివల్ల విజయ్ నివాసం చుట్టూ ఒక రకంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామాలన్నీ కరూర్ ఘటనపై ఏర్పడిన ప్రజా వ్యతిరేకత, రాజకీయ చర్చలకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు విజయ్ నిర్వహించిన సభలో తొక్కిసలాట జరగడం, మరొకవైపు ఆయన నివాసం వద్ద నిరసనలు, మద్దతు చర్యలు ఒకేసారి జరగడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సామాజిక వర్గాలు, రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## ఆశ్రమంలో విద్యార్థులపై లైంగిక వేధింపులు..
# స్వామి చైతన్యానంద సరస్వతి అరెస్ట్

ఆశ్రమం లైంగిక కేసులో ఒక ప్రధాన నిందితుడు స్వామి చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారథినిఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఆగ్రాలోని ఒక హోటల్ నుంచి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 17 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులు సహా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న చైతన్యానందను విచారించిన తర్వాత, అన్ని రహస్యాలు బయటపడతాయని భావిస్తున్నారు. నైరుతి ఢిల్లీలోని శ్రీ శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. మహిళా విద్యార్థులనున వెకిలిచేష్టలకు పాల్పడ్డట్లు.. స్వయం ప్రకటిత మత గురువు స్వామి చైతన్యానంద సరస్వతిపై ఆరోపణలు ఉన్నాయి. మార్చి 2025లో ఒక విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. దీంతో నిందితులు పారిపోయారు. 17 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని చైతన్యానందపై ఆరోపణలు ఉన్నాయి. చివరికి ఆగ్రాలోని ఒక హోటల్‌లో బస చేసిన చైతన్యానందను ఢిల్లీ పోలీసులు ఆదివారం (సెప్టెంబర్ 28) తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు అరెస్టు నుంచి తప్పించుకోవడానికి, చైతన్యానంద కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు స్వామి చైతన్యానంద సరస్వతి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా, చైతన్యానంద సరస్వతి ఐక్యరాజ్యసమితి ప్రతినిధి అని చెప్పకున్నారని ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలియజేశారు. దీని ఫలితంగా స్వామి చైతన్యానందపై పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నారు. అంతేకాదు 18 ఖాతాలలో జమ అయిన సుమారు



రూ. 8 కోట్లు, 28 ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్తంభింపజేశారు. ఈ డబ్బు నిందితుడు పార్థసారథి సృష్టించిన ట్రస్ట్‌తో ముడిపడి ఉంది.

అసలు విషయం ఏమిటి?

కొన్ని రోజుల క్రితం, శ్రీ శారదా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 17 మంది విద్యార్థినులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, చైతన్యానంద రాత్రిపూట తమను బలవంతంగా తన బెడ్ రూమ్ కు పిలిపించి శారీరక సంబంధంలోకి తీసుకునేవాడని ఆరోపించారు. అంతేకాకుండా, బాలికల హాస్టల్ గదుల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారనే విద్యార్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనేక మంది విద్యార్థినులను రాత్రిపూట అతని ప్రైవేట్ గదికి పిలిపించి విదేశీ పర్యటనలకు బలవంతం చేశారని ఫిర్యాదు చేశారు. తనను బలవంతంగా మధురకు తీసుకెళ్లారని ఓ విద్యార్థిని ఆరోపించింది. లైంగిక వేధింపులతో పాటు, నకిలీ లైసెన్స్ ప్లేట్ వాడటం, మతాన్ని ఉపయోగించి మోసం చేసినందుకు స్వామి చైతన్యానందపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోపణలు వచ్చినప్పటి నుండి ఢిల్లీ పోలీసులు చైతన్యానంద కోసం వెతుకుతున్నారు. ఆదివారం, పోలీసులు ఆగ్రా నుండి నిందితుడు చైతన్యానందను అరెస్టు చేశారు.

# అమెరికాలో కాల్పులు.. ముగ్గురి మృతి

అమెరికాలోని నార్త్ కరోలినాలో కాల్పులు జరిగాయి. కరోలినాలోని అమెరికన్ ఫిష్ కంపెనీ రెస్టారెంట్ సమీపంలో ఓ దుండగుడు బోటుపై నుంచి కాల్పులకు దిగాడు. కాల్పులు చోటుచేసుకోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర భయందోళనకు గురయ్యారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. అయితే, కాల్పుల జరిగిన తర్వాత దుండగుడు బోటులోనే పారిపోయాడు. దుండగుడి కోసం అమెరికా పోలీసులు వెతుకుతున్నారు. దగ్గరలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అమెరికా పోలీసులు స్థానికులకు సూచించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## జూరాలకు పోటెత్తిన వరద..
# 39 క్రెస్టు గేట్లు ఎత్తివేత

జూరాల జలాశయానికి భారీ వరద కొనసాగుతున్నది. దీంతో అధికారులు 39 క్రెస్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 4.85 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 4.94 లక్షల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు. ప్రస్తుతం 317.370 మీటర్ల వద్ద నీరు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ఇప్పుడు 7.407 టీఎంసీల నీరు ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో 26 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 4.39 లక్షల క్యూసెక్కులు వస్తుండగా, 5.83 లక్షల క్యూసెక్కుల వరద బయటకు వెళ్తున్నది. స్పిల్ వే ద్వారా 5.41 లక్షల క్యూసెక్కులు వెళ్తుండగా, పవర్ హౌస్‌కు 33,373 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 586.70 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్టులో 312.04 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 303.94 టీఎంసీల నీరు న్నది.

# బాలీవుడ్‌లో బంపరాఫర్

బాలీవుడ్‌లో 'ఫోర్స్' ఫ్రాంచైజీ చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. జాన్ అబ్రహం హీరోగా రూపొందిన రెండు భాగాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో సినిమా రానుంది. భవ్ ధూలియా దర్శకుడు. ఈ చిత్రంలో కథానాయికగా మీనాక్షి చౌదరిని ఖరారు చేశారు. హిందీలో పూర్తిస్థాయి నాయికగా ఆమె నటించబోతున్న తొలిచిత్రమిదే కావడం విశేషం. తెలుగులో హిట్-2, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలతో మంచి విజయాలు దక్కడంతో కొన్నేళ్లుగా టాలీవుడ్‌లోపైనే దృష్టిపెట్టిందీ భామ. తాజాగా భారీ ఆఫర్‌తో హిందీలోకి రీఎంట్రీ ఇస్తున్నది. ఈ సినిమాలో ఆమె యాక్షన్ ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపిస్తుందని, అందుకోసం కొన్ని వర్క్‌షాప్స్‌లో కూడా పాల్గొనబోతున్నదని టాక్. నవంబర్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగులో నవీన్ పొలిశెట్టి సరసన 'అనగనగా ఒకరాజు' చిత్రంలో నాయికగా నటిస్తున్నది.



02 EVENING EDITION
ఆదివారం | 28 సెప్టెంబర్ 2025 4PM
www.suryaa.com
సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# చరిత్ర సృష్టించిన శీతల్ దేవి



పారా వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి స్వర్ణ పతకం తీసుకొచ్చి, శీతల్ దేవి చరిత్ర సృష్టించింది. గ్వాంగ్జూ వేదికగా జరిగిన పారా వరల్డ్ ఆర్చరీలో అద్భుత విజయంతో దేశ ప్రతిష్టను శిఖరాగ్రానికి తీసుకెళ్లింది. టర్కీ టాప్ ర్యాంక్ క్రీడాకారిణి ఓజ్నూర్ క్యూవర్ గిర్డీని 146-143 తేడాతో ఓడించి, మహిళల కంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది.శీతల్‌కి ఈ టోర్నమెంట్‌లో ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకుముందు టోమన్ కుమార్‌తో జట్టు కట్టి మిక్స్‌డ్ టీమ్‌లో బ్రాంజ్ గెలిచింది. బ్రిటన్ జోడీ గ్రినామ్, నాథన్ మాక్ క్వీన్‌పై 152-149 తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా మహిళల కంపౌండ్ ఓపెన్ టీమ్ ఫైనల్‌లో సరితాతో కలిసి వెండి పతకాన్ని సాధించింది. అయితే అక్కడ ఫైనల్‌లో టర్కీ జట్టు చేతిలో పరాజయం పాలయింది. వ్యక్తిగత ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచే ఉత్కంఠభరితంగా సాగింది. తొలి ఎండ్ 29 - 29తో సమానంగా ముగిసింది. కానీ రెండో ఎండ్‌లో వరుసగా మూడు 10 పాయింట్లు కొట్టి ఆధిక్యం సాధించిన శీతల్ 30 - 27తో ముందంజ వేసింది. మూడో ఎండ్ మళ్లీ సమంగా (29-29) నిలిచింది. నాలుగో ఎండ్‌లో ఒక్క పాయింట్ వెనుకబడి ఉన్నా, 116-114 స్కోర్‌తో ఆధిక్యం నిలబెట్టుకుంది. చివరి ఎండ్‌లో మాత్రం అద్భుతంగా ఆడి, మూడు పర్ఫెక్ట్ 10లు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. సెమీఫైనల్‌లో శీతల్ ఇప్పటికే తన ఆధిపత్యాన్ని చాటింది. బ్రిటన్ క్రీడాకారిణి జోడీ గ్రినామ్‌పై 145-140 తేడాతో గెలిచింది. ఈ టైటిల్ పోరు 2023 పిల్జెన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు రీమ్యాచ్‌లా నిలిచింది. అప్పట్లో గిర్డీ 140-138తో విజయం సాధించగా, ఈసారి శీతల్ ప్రతీకారం తీర్చుకుంది. టీమ్ ఫైనల్‌లో శీతల్ - సరితా జంట తొలి ఎండ్‌లో ఆధిక్యం సాధించినా, తర్వాత నెర్వస్ కారణంగా స్కోర్లు తగ్గాయి. టర్కీ జంట గిర్డీ - బుర్సా ఫాత్మా అన్ చివరి వరకు దూకుడుగా ఆడి 152 - 148తో బంగారు పతకాన్ని గెలుచుకుంది. వ్యక్తిగత విభాగంలో శీతల్ ప్రదర్శన అత్యద్భుతం. తన మానసిక దృఢత, టెక్నికల్ నైపుణ్యంతో బంగారు పతకాన్ని గెలుచుకుని, భారత్‌లోనే కాక ప్రపంచ పారా ఆర్చరీలో తన స్థాయిని మరోసారి రుజువు చేసింది.



## ఆ రోజు అందరూ ఖాదీ వస్త్రాలే ధరించండి..
## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు

ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయంసమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని అన్నారు. దేశ స్వయంసమృద్ధి కోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులనే విక్రయించాలని ప్రధాని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ ఎపిసోడ్‌లో భాగంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ఆలిండియా రేడియోలో మాట్లాడారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని కోరారు. మహాత్మాగాంధీ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించారని ప్రధాని తెలిపారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ గత 11 ఏండ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని చెప్పారు. .

# రేవంత్ అహంభావం వల్లే రాష్ట్రానికి 15 వేల కోట్ల నష్టం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ముఖ్యమంత్రి రేవంత్ అహంభావం వల్లే తెలంగాణకు రూ.15 వేల కోట్ల నష్టం వాటిల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆయన అహంభావంతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఏకపక్షంగా ఎయిర్‌పోర్టు మెట్రోలైన్‌ను రద్దు చేశారని, అక్రమ కేసులు పెడుతామని ఎల్ అండ్ టీని బెదిరించారని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రయోజనాలు, కమీషన్ల కోసం ఎల్ అండ్ టీ ప్రతిష్టను దిగజార్చి, సంస్థను నాశనం చేయడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. అందుకే ఆ సంస్థ రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్నదని చెప్పారు. రేవంత్ ప్రభుత్వం చేతకానితనంతోనే రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నిలిచిపోయిందని, ఆరోగ్య శ్రీ పథకం స్తంభించిందని, ఆరు గ్యారంటీలు అటకెక్కాయని ఎక్స్ వేదికగా ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేతకానితనం, మితిమీరిన అహంభావం వల్ల రాష్ట్ర అభివృద్ధి గాడి తప్పింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి తీసుకుంటామన్న ప్రభుత్వ నిర్ణయంతో పౌరులపై రూ.15 వేల కోట్ల భారం పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతకానితనం, అనవసరపు అహంభావం వల్ల తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. తన రియల్ ఎస్టేట్ అవసరాల కోసం, ఉనికిలో లేని ఫోర్త్ సిటీ వైపు మళ్లించే నెపంతో, ఏకపక్షంగా ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్‌ను రద్దు చేశారు. మేడిగడ్డ వద్ద అక్రమ కేసులు పెడతామని ఎల్ అండ్ టీ వంటి భారీ కార్పొరేట్ సంస్థను బెదిరించారు. ఇది కేవలం తన రాజకీయ ప్రయోజనాలు, కమీషన్ల కోసమే. ఓ జాతీయ చానల్‌లోనే స్వయంగా ఎల్ టీ కంపెనీ సీఎఫ్ఓను జైల్లో పెట్టాల్సిందిగా పోలీసులను కోరానని గొప్పలు చెప్పుకున్నారు. ఎల్ అండ్ టీ ప్రతిష్టను దిగజార్చి, సంస్థను నాశనం చేయడానికి ప్రయత్నించారు. అయితే, తెలంగాణ ప్రజల్లాగా చేతకాని ముఖ్యమంత్రిని భరించాల్సిన అవసరం ఈ కంపెనీలకి లేకపోయింది. అందుకే వారు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోతున్నారు. సీఎం మితిమీరిన అహంభావం, గూండాగిరి కారణంగా రాష్ట్ర పన్ను చెల్లింపుదారులపై రూ.15 వేల కోట్ల అప్పు భారం పడనుంది. ప్రభుత్వ చేతకానితనం వల్లే రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోయింది, ఆరోగ్యశ్రీ పథకం స్తంభించింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కినాయి. కానీ, కార్పొరేట్ కంపెనీ రుణాన్ని భరించేందుకు మాత్రం రేవంత్ రెడ్డికి నిధులు ఉన్నాయి' అంటూ ట్వీట్ చేశారు.



## 'బాధ్యులపై చర్యలు తీసుకుంటాం'.. కరూర్ తొక్కిసలాటపై తమిళనాడు సీఎం


కరూర్ తొక్కిసలాట ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తొక్కిసలాటపై విచారణకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను నియమించినట్లు తెలిపారు. కమిషన్ విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని, ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకుముందే అంటే శనివారం రాత్రి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఎం స్టాలిన్ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కరూర్ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటివరకు 39 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర చరిత్రలో ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఇంతమంది మరణించడం ఇదే తొలిసారి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకూడదు. ప్రస్తుతం 51 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం అందిస్తాం' అని స్టాలిన్ పేర్కొన్నారు.



రాశి సింగ్.. తెలుగు సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో తనకంటూ మంచి ఇమేజ్ సంపాదించుకుంది. ఆది సాయి కుమార్ జోడిగా శశి మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అమ్మడు.ఆ తర్వాత సంతోష్ శోభన్ సరసన ప్రేమ్ కుమార్, భూతద్దం భాస్కర నారాయణ, ప్రసన్న వదనం, బ్లైండ్ స్పాట్ వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించింది. అలాగే ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు చిత్రంల నటించింది.అందం, అభినయంతో కుర్రాళ్లకు కునుకు లేకుండా చేసిన ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. వరుస హిట్స్ అందుకున్నప్పటికీ ఈ భామకు అంతగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది.అటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటున్న రాశి సింగ్.. నిత్యం ఏదోక ఫోటోషూట్ షేర్ చేస్తుంది. ట్రెడిషనల్, గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## అందాలు ఫుల్లు.. ఆఫర్స్ నిల్లు

# భారత్, పాకిస్థాన్ పోరుకు సర్వం సిద్ధం




ఆసియాకప్‌లో దాయాదులు భారత్, పాకిస్థాన్ పోరుకు సర్వం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొన్నది. టోర్నీలో ఇప్పటికే రెండుసార్లు పాక్‌ను మట్టికరిపించిన టీమ్‌ఇండియా మూడోసారి ఓడించాలన్న పట్టుదలతో ఉంది. అయితే భారత్, పాక్ మ్యాచ్‌లో భావోద్వేగాలు రెచ్చగొట్టి తమకు లబ్ధి పొందాలన్న శక్తులు రెండు దేశాల్లో సమాయత్తమవుతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌కు మతం, రాజకీయ రంగు పులమటం నిజంగా అత్యంత విషాదం. భారత్, పాక్ పోరాడటం ఇది కొత్త కాదు, ఆఖరి సారి కాదు. మ్యాచ్ గెలిచినప్పుడు కొందరు విపరీత పోకడలు కనబరుస్తున్నారు. అసలు ఇంతటి వివాదాలకు కారణమవుతున్న ఆసియాకప్‌లో భారత్ పోటీపడటం, దానికి బీసీసీఐ అభ్యంతరం చెప్పకపోవడం నిజయంగా ఆశ్చర్యం కల్గిస్తున్నది. బీసీసీఐకి కాసుల పంటకు దేశాన్ని కుదువ పెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. అత్యంత సంపన్న బోర్డుగా బీసీసీఐ క్రికెట్‌ను ఎలా శాసిస్తుందో మనం చూస్తున్నదే. కాకపోతే ఇరు దేశాల్లోని కొంత మంది ప్రజలు దీన్ని జీవన్మరణ సమస్య చేయడం దుర్మార్గం. భారత్, పాక్ మధ్య క్రికెట్ వివాదాలు కొత్తవి కావు. పాక్ అనైతికి బౌలింగ్‌కు సమాధానంగా మ్యాచ్‌ను విరమించిన బిషాన్‌సింగ్ బేడీ గతంలో వార్తల్లో నిలిచాడు. అంపైరింగ్‌లో పాకిస్థాన్ వివాదాలు కొత్తవి కావు. ఈ మధ్య భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నప్పటికీ గతంలో పాక్ గొప్ప జట్టు అన్న విషయం మర్చిపోరాదు. హఫీజ్‌ఖాన్, మాజీద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, సర్ఫరాజ్ నవాజ్, జహీర్ అబ్బాస్, మియాందాద్, మదస్సర్ నాజర్, వసీం అక్రమ్, వకార్ యూనిస్, షాహిద్ ఆఫ్రిది, సయిద్ అన్వర్, షోయబ్ అక్తర్, అబ్దుల్ ఖాదిర్, ఇంజామాముల్ హక్, యూసుఫ్ యోహనా వంటి హేమాహేమీలు పాక్‌ను బలమైన జట్టుగా మార్చారు. అయితే భారత్‌కు లాలా అమర్‌నాథ్, గవాస్కర్, కపిల్‌దేవ్, గుండప్ప విశ్వనాథ్, బేడీ, చంద్రశేఖర్, ప్రసన్న లాంటి వారు పాక్‌తో పోరాడారు. ఐపీఎల్ ఆగమనంతో భారత క్రికెట్ రూపురేఖలు మారిపోయాయి. కోహ్లీ, రోహిత్, సూర్యకుమార్ లాంటి క్రికెటర్ల ఆటతో భారత్ చిరస్మరణీయ విజయాలు సాధించింది. అంతమాత్రాన పాక్‌పై విజయాన్ని భూతద్దంలో చూడటం సరికాదు. ఇక్కడ భారత ప్రేక్షకులు ఒకటి గుర్తుంచుకోవాలి. బెన్సన్ హెడ్జెస్ వరల్డ్‌కప్ తర్వాత దశాబ్దం పాటు పాక్ చేతిలో ప్రతీసారి ఓటమిపాలయ్యాం. షార్జాలో మియాందాద్ ఆఖరి బంతికి సిక్స్ కొట్టి పాక్‌ను గెలిపించడం ఎవరం మర్చిపోం. ఆ తర్వాత కెనడాలో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో తొలిసారి దేబశిష్ మహంతి సూపర్ బౌలింగ్‌తో పాక్‌ను ఓడించాం. కానీ సిరీస్‌ను పాక్ 3-2తో కైవసం చేసుకుంది. ఆ తర్వాత 1996 వరల్డ్‌కప్‌లో పాక్‌పై జడేజా అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన అభిమానుల మదిలో ఇప్పటికీ మెదలుతూనే ఉంటుంది. పాకిస్థాన్‌లో లంక జట్టుపై ఉగ్రదాడి తర్వాత ఏ జట్టు అక్కడ ఆడేందుకు ముందుకు రాలేదు. 1992 ప్రపంచకప్ తర్వాత పాక్ మళ్లీ గెలువలేదు. ఇతర క్రీడల్లో భారత్‌పై పాక్ గెలుస్తున్నా..క్రికెట్‌లో మాత్రం కొందరు యాంకర్లు యుద్ధోన్మాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్య మైదానంలో రవూఫ్, ఫర్హాన్ రెచ్చగొట్టే విన్యాసాలు ఈ క్రీడకు మచ్చ తెచ్చాయి. భావోద్వేగాలు గురయ్యేది ప్రేక్షకులు తప్ప..నిజమైన ప్లేయర్లకు రాగద్వేషాలు ఉండవు. గతంలో కత్తులు దూసుకున్న ఇమ్రాన్‌ఖాన్, మియాందాద్, జహీర్ అబ్బాస్, ఇంజామాముల్ హక్, గవాస్కర్, సిద్ధు, కపిల్‌దేవ్, గంగూలీ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి.